# మంచిర్యాలకు నేడు డిప్యూటీ సీఎం, మంత్రులు

### 40 వేల మందితో భారీ బహిరంగ సభ : మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ సోమవారం మంచిర్యాల వస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటైన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రులు ఆవిష్కరించనున్నారు. అనంతరం రాళ్ల వాగు కరకట్ట నిర్మాణానికి శంకుస్థాపన, పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. మాతా శిశు ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్‌లో ర్యాలీగా బహిరంగ సభ స్థలానికి చేరుకుంటారని చెప్పారు. ఈ సభలో కొత్త పథకాలు ప్రకటించే అవకాశాలున్నాయని తెలిపారు. మండుటెండలో సుమారు 40 వేల మంది హాజరవుతారని చెప్పారు. 85 శాతం మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, సన్న బియ్యం కొనుగోలుకు బోనస్, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ లాంటి పథకాలతో ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. గత బీఆరెస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేసిన కారణంగా ప్రస్తుత ప్రభుత్వం ఆర్థికంగా కష్టాల్లో ఉందని విమర్శించారు. డంప్ యార్డు సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వేంపల్లిలో పరిశ్రమల కోసం భూములు బలవంతంగా లాక్కోవడం లేదని స్పష్టంచేశారు. మహాప్రస్థానం మంగళవారం నుంచి వినియోగంలోకి రాబోతుందని, నిరుపేదలకు ఉచిత అంత్యక్రియల వెసులుబాటు కల్పిస్తున్నామని చెప్పారు. అక్కడే మరణ ధ్రువపత్రం కూడా జారీ చేస్తామన్నారు. తాను చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వక్రీకరిస్తే సహించబోనని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కే ఓసీ గనిలో అగ్నిప్రమాదం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



కోల్ బెల్ట్ ఏరియాలోని రామకృష్ణాపూర్ వద్ద ఉన్న మూసివేసిన ఆర్కే ఓసీ ఉపరితల గనిలో ఆదివారం అకస్మాత్తుగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వేసవి కాలం కావడంతో చెట్ల ఆకులు రాలిపోయి, అవి నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయని తెలుస్తోంది. మంటలు వ్యాపిస్తున్న దృశ్యాన్ని గమనించిన ఎస్ అండ్ పీసీ ప్రైవేట్ సిబ్బంది వెంటనే సింగరేణి అధికారులకు, అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్ అండ్ పీసీ, రెస్క్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. మంచిర్యాల అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగిస్తోంది.

# ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటనల ఏర్పాట్లను సమీక్షించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన వంటి కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ (సీతక్క) పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్య కార్యక్రమాల కోసం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ శివాజీ, తహసీల్దార్ రఫతుల్లా లతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న మహా ప్రస్థానాన్ని పరిశీలించి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మూడేళ్ల బాలుడి కడుపులో బ్యాటరీ

- సమయస్ఫూర్తితో ప్రాణాలు కాపాడిన వైద్యుడు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** తినడంలో ఇబ్బంది, కడుపులో మంట, నొప్పి ఈ లక్షణాలతో రెండు నెలలుగా బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి సమస్యకు జిల్లాలోనే తుది పరిష్కారం లభించింది. స్థానిక సతీష్ గ్యాస్ట్రో, లివర్ ఆసుపత్రిలో డాక్టర్ గడిగొప్పుల సతీష్ చంద్ర నిర్వహించిన ఎండోస్కోపీలో బాలుడి కడుపులో బటన్ బ్యాటరీ ఉన్నట్లు గుర్తించి, అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి తొలగించారు. శ్రీరాంపూర్‌కు చెందిన సిరిపురం రాజ్ కుమార్, మౌనిక దంపతుల కుమారుడు ఆదిత్య (3) గత రెండు నెలలుగా తినడంలో, మింగడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినా ఎలాంటి ఫలితం రాకపోవడంతో చివరకు సతీష్ గ్యాస్ట్రో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన డాక్టర్ సతీష్ చందర్ ఎండోస్కోపీ ద్వారా బాలుడి కడుపులో అల్సర్‌ను గుర్తించగా, అక్కడే ఓ చిన్న బటన్ బ్యాటరీ ఉన్న విషయాన్ని కనుగొన్నారు. వెంటనే సర్జరీ ద్వారా బ్యాటరీను తీసి, అల్సర్‌కు అవసరమైన చికిత్సను అందించారని తెలిపారు. ఈ విధంగా సమయానికి స్పందించి బాలుడి ప్రాణాలను కాపాడిన డాక్టర్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాటరీ వంటి వస్తువులు చిన్నారుల శరీరంలోకి వెళ్లిన సందర్భాల్లో వెంటనే గుర్తించి చికిత్స చేయకపోతే ప్రమాదం ఏర్పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



## అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దే

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ నేత వెరబెల్లి రఘునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో అంత్యక్రియలు జరగనివ్వకుండా ముంబైకి పార్థివదేహాన్ని తరలించడమే కాకుండా, ఆ తరలింపునకు సంబంధించిన విమాన ఛార్జీలను అంబేద్కర్ సతీమణిపై బిల్లుగా వేయించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. అంబేద్కర్ ఆలోచనలు బీజేపీకి ప్రేరణ అని, ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తోందని తెలిపారు. దళితుడు రామ్‌నాథ్ కోవింద్, ఆదివాసీ ద్రౌపది ముర్మును రాష్ట్రపతులుగా నియమించడం, పంచతీర్థాల ఏర్పాటు, కేంద్ర మంత్రివర్గంలో దళితులకు, ఓబీసీలకు, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం అంబేద్కర్ కలల సాకారమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, దుర్గం అశోక్, కొయ్యల ఎమాజీ, పెద్దపల్లి పురుషోత్తం, అమరరాజుల శ్రీదేవి, కోడి రమేష్, గాజుల ముఖేష్, బియ్యాల సతీష్ రావు, మున్నరాజ్ సిసోడియా, బత్తుల సమ్మయ్య, సత్రం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



**శెనార్తి మీడియా, దండేపల్లి:** అత్తింటి వారి అదనపు కట్నం వేధింపులు ఓ వివాహితను బలి తీసుకున్నాయి. పెళ్లి జరిగి ఎనిమిదేళ్లయినా.. అత్తింటి వారి అదనపు కట్నం దాహం తీరలేదు. నాలుగేళ్లుగా భర్తతోపాటు అత్త, మామ, బావ, మరిది వేధింపులను తట్టుకుంది. ఆరు నెలల క్రితం ఆడపిల్ల పుట్టడంతో వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా అత్తింటివారి తీరు మారలేదు. చివరకు సున్నిత మనస్కురాలైన ఆ వివాహిత చావే శరణ్యనుకుంది. ఉరేసుకుని తను వు చాలించింది. దీంతో ఆరేళ్ల బాబు, ఆరు నెలల పాప తల్లి లేనివారయ్యారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివారం జరిగింది. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నా... ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. దండేపల్లికి చెందిన గంగధరి మల్లేశ్‌కు, జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేటకు చెందిన వరలక్ష్మి అలియాస్ మేఘన (38)తో 2017లో వివాహం జరిగింది. పెళ్లి సమ యంలో రూ.4 లక్షల కట్నం, 4 తులాల బంగా రం, ఇతర సామగ్రి ఇచ్చారు. పెళ్లయిన నాలుగేళ్ల వరకు వీరి కాపురం బాగానే సాగింది. కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న భర్త మల్లేశ్‌కు అదనపు కట్నం కావా లన్న ఆశ పుట్టింది. అప్పటి నుంచి భార్యను వేధిస్తున్నాడు. అతనికి తల్లి, తండ్రి లక్ష్మి, నర్సయ్యతోపాటు అన్న, తమ్ముడు తోడయ్యారు. కుటుంబమంతా వేధించడంతో వరలక్ష్మి భరిం చలేక పోయింది. ఈ విషయం పుట్టింటివారికి చెప్పడంతో ఏడాది క్రితం పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. నచ్చజెప్పి మళ్లీ కాపురానికి పంపించారు.

**ఆరు నెలల క్రితం పాపకు జననం..**

ఈ క్రమంలో వరలక్ష్మి రెండోసారి గర్భందాల్చింది. ఆరు నెలల క్రితం పాపకు జన్మనిచ్చింది. దీంతో అదనపు కట్నం వేధింపులు మళ్లీ మొదలయ్యాయి. రోజు రోజుకూ వేధింపులు పెరుగుతుండడంతో భరించలేకపోయింది. పది రోజుల క్రితం భీవండిలో ఉండే తన తండ్రి రాజమల్లుకు ఫోన్ చేసి చెప్పింది. తాను యశ్వంత్‌రావ్‌పేటకు వచ్చిన తర్వాత.. దండేపల్లికి వస్తానని, పుట్టింటికి తీసుకువస్తానని నచ్చజెప్పాడు. శనివారం స్వగ్రామానికి వచ్చిన రాజమల్లు ఆదివారం భార్య అమ్మాయితో కలిసి దండేపల్లిలోని కూతురు ఇంటికి వెళ్లాడు. కూతురు కనిపించకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా చీరతో ఉరేసుకుని కనిపించింది. కన్నబిడ్డను విగతజీవిగా చూసిన తల్లిదండ్రులో బోరున విలపించారు. పుట్టింటికి తీసుకుపోతానంటిని కద బిడ్డా.. అంటూ తండ్రి విలపించిన తీరు అందరినీ కన్నీరు పెట్టించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన కూతురు చావుకు కారకులైన అల్లుడు, అతని తల్లిదండ్రులు, అన్న, తమ్ముడిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి రాజమల్లు ఫిర్యాదు చేశారు.

# లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- తుడుం దెబ్బ నాయకుల డిమాండ్ జోడేఘాట్‌లో
- రెండో రోజూ రాష్ట్ర మహా భలు



**శెనార్తి మీడియా, కొమురంభీమ్ ఆసిఫాబాద్:**



లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫె సర్ డీఎస్‌డబ్ల్యూ శ్రీనివాస్ రావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్ రావు డిమాండ్ చేశారు. జోడేఘాట్‌లో రెండో రోజూ తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలు కొనసాగాయి. రాష్ట్ర సమన్వయకర్త బూర్స పోచయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రొఫెసర్ డీఎస్‌డబ్ల్యూ శ్రీనివాస్ రావు, ఆత్రం భుజంగరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, లంబాడీలు విద్య కోసం తాత్కాలికంగా ఎస్టీలుగా గుర్తింపు పొందినప్పటికీ, ప్రస్తుతం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు పొందుతూ ఆదివాసుల అవకాశాలను దోచుకుంటున్నారని తెలిపారు. 1976లో ఓబీసీలుగా ఉన్న లంబాడీల జనాభా, 1981 నాటికి అనూహ్యంగా పెరగడం వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయని అన్నారు. ఆత్రం భుజంగరావు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన నుంచే ఆదివాసుల హక్కులు కాలరాయబడుతున్నాయని, ఇప్పుడు కూడా అదే తంతు కొనసాగుతోందన్నారు. కేంద్రం వనరులను కార్మిక సంస్థలకే అప్పగిస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉద్యమాలు అవసరమని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిద్ధిబోయిన లక్ష్మీనారాయణ, కోట్నక విజయ్ కుమార్, గోడం గణేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు ఆదివాసి, విద్యార్థి, మహిళా, రైతు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

## 15 రోజుల వ్యవధిలో యువజంట ఆత్మహత్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం దేవులవాడకు చెందిన గాదే సృజన చదువుల్లో మేటిగా ఎదిగింది. తండ్రి వ్యవసాయం చేసుకుంటూ ఉన్నత చదువులు ఇప్పించాలని లక్షెట్టిపేటలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చేర్పించారు. అదే కాలేజీలో సీనియర్‌గా చదువుతున్న విశ్వవర్ధన్ అనే యువకుడితో స్నేహం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరూ బీసీ వర్గానికి చెందినవారైనా కుల భేదం కారణంగా ఇరుకుటుంబాలు ఈ పెళ్లిని ఒప్పుకోకపోవచ్చని భావించి, స్నేహితుల సహాయంతో ప్రేమవివాహం చేసుకున్నారు. గత ఆరు నెలలుగా విడివిడిగా కాపురం పెట్టుకుని ఆనందంగా జీవిస్తున్నారు. గ్రామంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటూ వార్డు సభ్యుల ప్రశంసలు కూడా పొందారు. గత నెల 24న విశ్వవర్ధన్ రాయపట్నం గోదావరి బ్రిడ్జి వద్ద నుంచి నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకు న్నాడు. ఈ ఘటన తట్టుకోలేని సృజన తన మాయమాట్లతో ఓదార్చే ప్రయత్నం చేసిన కుటుంబ సభ్యులు, స్థానిక నాయకుడి ప్రయత్నాల్ని విస్మరించి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. 15 రోజుల వ్యవధిలో ప్రేమికులు ఇద్దరూ జీవితం వదిలేయడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి మృతిపై సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

## చలివేంద్రం ఏర్పాటు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

వేసవి కాలంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రామాలయం చౌరస్తాలో కాంగ్రెస్ యువ నాయకుడు గంపల వీరస్వామి తన తండ్రి కీ.శే గంపల రాజనర్సు స్మరణార్థంగా ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ, అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు గాండ్ల సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన గంపల వీరస్వామి కుటుంబ సభ్యులను అభినందించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మహంకాళి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి కళ్యాణ్, సత్యనారాయణ, మేకల కుమారస్వామి, కనుకుంట్ల కుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో రోడ్డు ప్రమాదం

- బాలుడు మృతి..
  మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో రోడ్డు ప్రమాదం ఘోర విషాదానికి దారితీసింది. ఆదివారం మంచిర్యాల కేంద్రంలోని హైలైఫ్ రెస్టారెంట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒక మైనర్ బాలుడు మృతి చెందాడు. మరో ఇద్దరు మైనర్లు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురు మైనర్లు ఒకే బైక్‌పై మంచిర్యాల వైపు వస్తుండగా, అదే సమయంలో యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న 15 ఏళ్ల బాలుడికి, అతనితో ఉన్న 13 ఏళ్ల మిత్రుడికి తీవ్ర గాయాలు కాగా, 10 ఏళ్ల బాలుడు ఘటనాస్థలిలోనే తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడిన బాలులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. మృత చెందిన బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ ఎస్ఐ వినీత వెల్లడించారు.

# కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజల ఆకాంక్ష

**శెనార్తి మీడియా, గోదావరిఖని :**



కేసీఆర్ పాలన కోసం ప్రజలు మళ్లీ ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. బీఆర్ఎస్ 25వ రజతోత్సవ సభ కోసం దళితబంధు లబ్ధిదారులు రూ.2 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని చెక్కుగా చందర్‌కి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా దళితబంధు పథకం అమలుచేసిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషి చేశాడని, మళ్లీ ఆయన సీఎం కావాలన్నది ప్రజల ఆకాంక్షగా వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్, నాయకులు నీరటి శ్రీనివాస్, చింటూ, శ్రవణ్, కొర్రీ ఓదెలు, కోడి రామకృష్ణ, అయిత నాగరాజు, రొడ్డ లక్ష్మి, శాంతలక్ష్మి, హరికృష్ణ పాల్గొన్నారు.

## కమనీయం.. రమణీయం.. సీతారామచంద్రస్వామి రథోత్సవం

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

గంగాధర మండలం గట్టుభూత్కూర్ శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన స్వామివారి రథోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. వారం రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవ మూర్తులను రథంపైకి తెచ్చి ఆలయం చుట్టూ తిప్పి రథోత్సవం నిర్వహించారు. హనుమాన్ మాలధారులు, భక్తుల జై శ్రీరాం నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కంకణాల విజయేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్ రెడ్డి, నాయకులు కనుకయ్య, పూదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. 'జై బాపు- జై భీమ్- జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు మొలంగూరు, చింతలపల్లి, రాజాపూర్, ముత్తారం, మక్త గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్రను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలు చేపట్టారు. ప్రజల మధ్యకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకు న్నారు. గ్రామాల కూడళ్లలో రాజ్యాంగ పరిరక్షణ శపథం చేయించారు. కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, 'జై బాపు జై భీమ్ జై రాజ్యాంగం' విధాన సభ సమన్వయకర్త నమిండ్ల శ్రీనివాస్, మండల సమన్వయకర్త కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల విభాగం అధ్యక్షుడు పులి ఆంజనేయులు, హుజురాబాద్ వ్యవసాయ విపణి సంఘం ఉపాధ్యక్షుడు నాంపల్లి తిరుపతి, బ్లాకు మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ, మండల మహిళా అధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి, యువజన విభాగం ఉపాధ్యక్షుడు ఎండి షారుఖ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఆడెపు అజయ్, బీసీ విభాగం మండల అధ్యక్షుడు రెడ్డి పవన్, గండికోట రవి పాల్గొన్నారు



## దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** పార్లమెంట్లో బీసీ బిల్లు ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాద్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవ పట్నంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షను రాష్ట్ర అధికార ప్రతినిధి బొంగోని అభిలాష్ గౌడ్ చేపట్టారు. దీక్ష లో శంకరపట్నం మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును పార్లమెంట్లో ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిక్యాల భాస్కర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చిలకమారి శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ జినుకాల లక్ష్మణరావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్వెల్లి, సామాజిక విప్లవకా రుడు సనత్ జై సూర్య, సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి, ముస్లిం జేఏసీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ఎండి రహీముద్దీన్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఎల్కపల్లి సుధీర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా పవన్



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మొలంగూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. దాసరపు పవన్ కుమార్ అధ్యక్షుడిగా, మొల్గూరి రమేష్ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. కమిటీలో కాలేశి కరుణాకర్, కోరపెల్లి శివప్రసాద్, కాసర్ల ప్రభాస్ ఉపాధ్యక్షులుగా, కనకం సాయికుమార్ కోశాధికారిగా, గాజుల సుదర్శన్ సంయుక్త కోశాధికారిగా ఎన్నికయ్యారు. మోరె శ్రీనివాస్, ఆకునూరి మహేందర్ ముఖ్య సలహాదారులుగా, మోరె సతీష్, మోరె గణేష్, దాసరపు నరేందర్, గాజుల రమేష్, మోరె పోచయ్య గౌరవ సలహాదారులుగా ఎన్నికయ్యారు.

## అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

గంగాధర మండలం మధురానగర్ సురభి కాన్వెంట్ హైస్కూల్ లో 2012– 13 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నా రు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనా టి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి టీచర్లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చిప్ప వీరేశం మాట్లాడు తూ తమ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు నేడు ఉన్న తస్థాయిలో ఉండడం తమకు గర్వ కారణంగా ఉందన్నారు. స్కూల్ డైరెక్టర్ చిప్ప వీరనర్సయ్య, టీచర్స్ శ్రీనివాస్, సంతోష్ కుమార్, రమేష్, రాములు, ఉమ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** వంకా యగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుల నియోజకవర్గ ఇన్చార్జి బూర్ల మొగిలి తల్లి బూర్ల మధునమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆమె దినకర్మ కార్యక్రమానికి మానకొండూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆదివారం హాజరయ్యారు. మధునమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.